

8లో..

## కర్రె గుట్టపైకి రావొద్దు

- మా రక్షణ కోసం బాంబులు అమర్చినం
- మావోయిస్టు పార్టీ వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 174
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
ఏప్రిల్ 08, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

## భూ ఆక్రమణను నిరూపిస్తే.. గులాంగిరి చేస్తా

- లేకుంటే పల్లా, తాటికొండ నాకు గులాంగిరి చేయాలి
- చీము, నెత్తురు ఉంటే నా సవాల్ స్వీకరించాలి
- సీనియర్ ను అయినందుకే నాపై ఆరోపణలు
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


2లో..

## రాజకీయ చైతన్యం రావాలి

- పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్
- శాయంపేటలో పద్మశాలి కులస్తుల బైకు ర్యాలీ



## తొర్రూరు డివిజన్ లో రాళ్లవాన

**| నేలకొరిగిన వరిచేలు | తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు**

తొర్రూరు డివిజన్ పరిధిలో మంగళవారం కురిసిన అకాల వర్షం అన్నదాతను ఆగం చేసింది. గాలివాన, వడగళ్లతో రైతన్నలను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతల ఆందోళన చెందుతున్నారు. వారంరోజుల్లో వరికోతలు పూర్తి అవుతాయని అంతా అనుకుంటున్న సమయంలో కురిసిన భీకరమైన రాళ్ల వాన అన్నదాతలను నిలువునా ముంచింది. అకాల వర్షానికి వరిచేలే నేలమట్టం అయ్యాయి. రాష్ట్ర పభుత్వం పంట నష్టంపై వెంటనే సర్వే చేసి వారం రోజుల్లో రైతులకు పరిహారం అందించాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

– వరంగల్ వాయిస్, తొర్రూరు




# బల్దియా.. బాగుపడేనా..?


వివరాలు2లో..

- అవినీతిమయమంటూ సర్వత్రా విమర్శలు
- ఆకస్మిక తనిఖీలతో మేయర్ హల్ చల్
- ప్రధాన కార్యాలయంలోని వివిధ సెక్షన్ల సందర్శన
- అధికారులను, అవినీతిని మేడమ్ గాడిన పెట్టేనా అంటూ సెటైర్లు
- ఉత్తిత్తి తనిఖీలు కావద్దంటున్న జనం

బల్దియా ప్రధాన కార్యాలయంలో మంగళవారం నగర మేయర్ గుండు సుధారాణి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మేయర్ చాంబర్ భవనంలోని సెల్లార్ ఏరియాతో పాటు కార్యాలయంలోని ఇన్ వార్డ్, కంట్రోల్ రూమ్, ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్, జనన మరణ ధ్రువీకరణ సెక్షన్, పెన్షన్ సెక్షన్, అకౌంట్స్ సెక్షన్ ఇలా గ్రేటర్ లోని అన్ని సెక్షన్ లలో ఆమె క్షేత్ర స్థాయిలో పర్యటించి సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే తాట తీస్తానంటూ హెచ్చరించారు. అయితే మేడమ్ తనిఖీలతోనైనా అవినీతిలో లిమ్కా బుక్ కు చేరువలో ఉన్న బల్దియా బాగుపడేనా అన్న చర్చ సాగుతోంది. లేక అధికారులను హడలెత్తించేందుకు చేస్తున్న ఉత్తిత్తి తనిఖీలేనా అంటూ చర్చించుకుంటున్నారు. గతంలో కొంతమంది మేయర్లు తనిఖీల పేరుతో హల్ చల్ సృష్టించి అధికారుల నుంచి నెల వారీ వసూళ్లకు పాల్పడేవారన్న ఆరోపణలున్నాయి. వారే కింది స్థాయి సిబ్బందిని లంచగొండులుగా మార్చారన్న విమర్శలున్నాయి. అయితే నగరాభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్న మేయర్ గుండు సుధారాణి ఆకస్మిక తనిఖీలతో అవినీతి అధికారుల భరతం పట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు. అవినీతి రహిత బల్దియా నిర్మాణంలో మేయర్ సుధారాణి తనవంతు పాత్ర పోషించాలంటున్నారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

# బల్దియా.. బాగుపడేనా..?



- అవినీతిమయమంటూ సర్వత్రా విమర్శలు
- ఆకస్మిక తనిఖీలతో మేయర్ హల్ చల్
- ప్రధాన కార్యాలయంలోని వివిధ సెక్షన్ల సందర్శన
- సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్న సుధారాణి
- అధికారులను, అవినీతిని మేడమ్ గాడిన పెట్టేనా అంటూ సెటైర్లు
- ఉత్తిత్తి తనిఖీలు కావద్దంటున్న జనం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నగర మేయర్ గుండు సుధారాణి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ చాంబర్ ఉన్న సెల్లార్ లో పార్క్ చేసి ఉన్న వాహనాల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ సిబ్బంది, కార్పొరేటర్ల వాహనాలు కాకుండా ప్రైవేట్ వాహనాలు సెల్లార్ లో పార్కు చేయడానికి వీలు లేదంటూ హెచ్చరించారు. సెల్లార్ లో ఉన్న చెత్తను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం ప్రధాన కార్యాలయంలోని ఇన్ వార్డులో సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి వారు చేపట్టే జాబ్ చార్ట్ ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ప్రతి ఒక్కరు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

### హెల్ప్ డెస్క్ సందర్శన..

ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ను మేయర్ సుధారాణి సందర్శించి ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులకు వచ్చే సందేహాలను ఏ విధంగా నివృత్తి చేస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బర్త్, డెత్ సెక్షన్ లో పర్యటించి జనన మరణ నమోదుకు సంబంధించిన ఆఫ్ లైన్, ఆన్ లైన్ రికార్డులను పరిశీలించి నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని, నాన్ అవలబిలిటీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే దరఖాస్తులతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ అందించే సర్టిఫికెట్ల సంబంధిత సమాచారాన్ని నమోదు చేస్తూ రికార్డు నిర్వహించాలని మేయర్ సూచించారు. అనంతరం పెన్షన్ సెక్షన్ ను సందర్శించి బల్దియా తరపున ఎంతమందికి పెన్షన్ అందుతోంది.. కొత్తగా ఎంతమంది నమోదు చేసుకున్నారు? సంబంధిత సమాచారాన్ని సూపరిండెంట్ ను అడిగి తెలుసుకున్నారు. ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ లో సిబ్బందికి కేటాయించిన విధి నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ ఆవరణలో గల షి టాయిలెట్ ప్రాంతాన్ని మేయర్ పరిశీలించారు.

### అధికారులతో సమావేశం..

అనంతరం అన్ని విభాగాల అధికారులతో మేయర్ గుండు సుధారాణి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకస్మికంగా తనిఖీలో వెలుగు చూసిన లోపాలను అధికారుల దృష్టికి తీసుకుపోయి త్వరిత గతిన పరిష్కరించాలని సూచించారు. అదే విధంగా పరిపాలన భవనానికి కలరింగ్ చేయాలని ఆదేశించారు. కార్యాలయంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, సిటిజన్ చార్టర్ ఖచ్చితంగా అమలు చేస్తూ నగర ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ హాల్ పునరుద్ధరణ, నవీకరణ పనులను మేయర్ పరిశీలించి సమర్ధంగా నిర్వహించుటకు ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులకు మేయర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, హెచ్ఓలు రమేష్, లక్ష్మా రెడ్డి, జేఏఓ జగదీశ్వరి, సూపరిండెంట్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తిత్తి తనిఖీలు కాకూడదు..

అవినీతిలో కూరుకుపోయిన బల్దియా ప్రక్షాలనకు నగర మేయర్ గుండు సుధారాణి ఇలాంటి ఆకస్మిక తనిఖీలు మరిన్ని జరుపాలని నగర ప్రజలు కోరుతున్నారు. బల్దియా ప్రక్షాలనలో ఆమె చురుకైన పాత్ర పోషించాలంటున్నారు. సిటిజన్ చార్టర్ ను పట్టించుకోని అధికారులపై వేటు వేయాలంటున్నారు. ప్రతి పనికి ఒక రేటును నిర్ణయించి బల్దియా పరువును బజారున పడేస్తున్న సిబ్బందిపై ఉక్కుపాదం మోపాలంటున్నారు. అవినీతి రహిత మహా నగర పాలక సంస్థ అంకురార్పణకు మేయర్ గుండు సుధారాణి బీజం వేయాలని నగర ప్రజలు కోరుతున్నారు. బల్దియా బాగుపడేలా ఆమె చర్యలుండాలంటున్నారు.







# త్వరలో ఇండోర్ సబ్ స్టేషన్లు

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
- హనుమకొండ సర్కిల్ విద్యుత్ అధికారులతో సమీక్ష



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్, హనుమకొండ, కరీంనగర్ ప్రాంతాల్లో ఇండోర్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ లో మంగళవారం హనుమకొండ సర్కిల్ పరిధిలోని విద్యుత్ అధికారులతో సీఎండీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ పరిధిలో ఏర్పాటు చేసే కొత్త సబ్ స్టేషన్ లకు స్థలాభావం కారణంగా ఇండోర్ సబ్ స్టేషన్లు పెట్టాలని సూచించారు. ప్రతి పనిలో సాంకేతికత అవలంభించాలని సూచించారు. డ్రోన్ ద్వారా పోల్ టు పోల్ సర్వే చేయించి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భవిష్యత్తులో అండర్ గ్రౌండ్ కేబుల్ వేస్తామన్నారు. కన్స్యూమర్ ఫీడ్ బ్యాక్ సెల్ లో వినియోగదారుల నుంచి సానుకూల స్పందనలు రావడం శుభ పరిణామమన్నారు. దేవునూరు, క్యాతాన్ పల్లి తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. వినియోగదారులకు ఉత్తమ సేవలు, నాణ్యమైన విద్యుత్ అందించడానికి ఎల్లపుడు నిబ్బద్ధతో పనిచేస్తూ వారితో మమేకమవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీఈలు రాజు చౌహన్, తిరుమల్ రావు, హనుమకొండ ఎస్ఈ మధుసూదన్, ఎస్ఈలు శ్రీకాంత్, సురేందర్, అన్నపూర్ణ, శ్రీనివాస్, డీఈలు సాంబరెడ్డి, విజేయేందర్ రెడ్డి, దర్శన్ కుమార్, ఏడీఈలు నార్ల సుబ్రమణేశ్వర్ రావు, మల్లికార్జున్, దేవేందర్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ చైతన్యం రావాలి

- పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్

**వరంగల్ వాయిస్ శాయంపేట :** పద్మశాలీల్లో రాజకీయ చైతన్యం రావాలని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్ పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మండల కమిటీతోపాటు, యువజన, మహిళా విభాగం కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకుని నూతన సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వార్డు మెంబర్ నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థాయిలో పోటీకి పద్మశాలి కులస్తులు సిద్ధం కావాలన్నారు. ఐక్యంగా ఉంటే అన్ని సాధించుకోవచ్చన్నారు. పద్మశాలిల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వాలు చొరవ చూపాలని ఆ దిశగా సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రధాన రహదారి వెంట బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు బచ్చు ఆనందం, ప్రధాన కార్యదర్శి దిడ్డి రమేష్, యువజన విభాగం అధ్యక్షులు పొరండ్ల కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కందికట్ల ప్రశాంత్, మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు వెంగళ వేణుగోపాల్, పసినూటి భిక్షపతి, బాసని రవి, వలసదాసు చంద్రమౌళి, కుసుమ శరత్ బాబు, బూర లక్ష్మీనారాయణ, మామిడి శంకర్ లింగం, రంగు ఆనందం, దిడ్డి ప్రభాకర్, కల్పన, రాణి, పద్మ, శాంత, రవి, ప్రకాష్, పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.



# ఘనంగా విజయ చందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, పరకాల:** హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా. పెసరు విజయ చందర్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం హనుమకొండ రెడ్ క్రాస్ కాన్ఫరెన్స్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. పాలకవర్గ సభ్యులు, రెడ్ క్రాస్ సిబ్బంది ఆయనకు శాలువా కప్పి సన్మానించి, కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పరకాల నియోజకవర్గ కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డా. విజయ చందర్ రెడ్డి ప్రారంభించి, రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ మాట్లాడుతూ, చైర్మన్ విజయ చందర్ రెడ్డి ప్రజల సేవలో ఎల్లప్పుడూ ముందుండి, పాలకవర్గ సభ్యులకు మార్గదర్శిగా ఉంటారని తెలిపారు. రెడ్ క్రాస్ కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి మాట్లాడుతూ, విజయ చందర్ రెడ్డి తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ట్రెజరర్ గా కూడా సేవలందిస్తూ రాష్ట్రంలోని క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ డా. విజయ చందర్ రెడ్డి స్వతహాగా ఆర్థోపెడిక్ డాక్టర్ గా, రెడ్ క్రాస్ చైర్మన్ గా ఎన్నో సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. అలాగే, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పాలకవర్గ సభ్యులు పొట్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, విజయ చందర్ రెడ్డి లయన్స్ క్లబ్ లో కూడా అనేక సేవా కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉన్నారని చెప్పారు. డా. ఎం. శేషుమాధవ్ మాట్లాడుతూ, ఆయన ఆర్థోపెడిక్ అసోసియేషన్ సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ గా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ గా సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా డా.విజయ చందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి, రక్త కొరత నివారణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. చెన్నమనేని జయశ్రీ, బిళ్ల రమణ రెడ్డి, రెడ్ క్రాస్ డాక్టర్లు డా. జె. కిషన్ రావు, డా. టి. మదన్ మోహన్ రావు, డా. మొహమ్మద్ తహర్ మసూద్, బీజేపీ రాష్ట్ర నాయకులు డా. పగడాల కాళీప్రసాద్, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి టి. జయపాల్, ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డా.నాగార్జున రెడ్డి, పరకాల నియోజకవర్గ బీజేపీ నాయకులు కాచం గురుప్రసాద్, రాంబాబు, శ్రీరాం రెడ్డి, ముత్యాల శ్రీనివాస్, జయంత్ లాల్, మేఘనాథ్, మొలుగూరి శ్రీనివాస్, ములక ప్రసాద్, శివకుమార్, వి.రాజ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, గాజుల నిరంజన్, జాన్ విక్రమ్, ప్రభాకర్ మరియు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ ధర పెంపు ప్రజలపై భారమే



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గృహావసరాల కోసం వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరను కేంద్రం 50 రూపాయల మేర పెంచడాన్ని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా విమర్శించారు. మోడీ ప్రభుత్వం గత పదేళ్లుగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలను బతకలేని స్థాయికి పెంచుతూ పేద, మధ్య తరగతి ప్రజలపై లక్షలాది కోట్ల రూపాయల భారం మోపిందని ఆయన ఆరోపించారు. ఇటీవల కేంద్ర బడ్జెట్ సమయంలో ప్రజలపై భారం మోపే పని ఇక చేయబోమని చెప్పిన ప్రభుత్వం, తాజాగా గ్యాస్ ధరను 50 రూపాయల మేర పెంచి మంగళవారం నుంచే అమలు చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రుణాలను మాఫీ చేస్తూ, సామాన్యులు వాడే గ్యాస్ ధర పెంపు న్యాయమా? అని ప్రశ్నించారు. కార్మికులు, రైతులు, కష్టజీవుల ఆదాయాల్లో ఎలాంటి పెరుగుదల లేకపోయినా, నిత్యావసరాల ధరలు మాత్రం ఏకంగా హనుమంతుని తోకలా పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సిలిండర్ ధర రూ.900 నుంచి రూ.950కు పెరగడం వల్ల సామాన్య ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటారని వివరించారు. ప్రజలపై భారం మోపే విధానాలను వెంటనే విరమించి, పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## జీరో బ్యాలెన్స్‌తో ఎస్బీఐ అకౌంట్

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ ప్రజలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) బ్రాంచ్ గుడ్ న్యూస్ చెప్పింది. ఈ నెల 7 నుంచి 11వరకు జీరో బ్యాలెన్స్ ఎకౌంట్ మేళాను నిర్వహిస్తున్నామని వివరించారు. సాధారణంగా బ్యాంకు ఎకౌంటు ఓపెన్ చేయుటకు రూ.2 వేల డిపాజిట్ చేయాలి. కానీ, ఎస్బీఐ ఈ ఆఫర్ ను తీసుకోవచ్చింది. ఇందుకు ప్రస్తుతం కొత్త అకౌంట్ ఓపెన్ చేయుటకు ఎటువంటి డబ్బులు అవసరం లేదని ఎస్బీఐ బ్యాంకు మేనేజర్ సుధాకర్ తెలిపారు. జీరో బ్యాలెన్స్ ద్వారా అకౌంట్ తీసుకోవచ్చని వివరించారు. చెక్ బుక్, నెట్ బ్యాంకింగ్, ఏటీయం,యూపీఐ బదీలి సదుపాయం అందుతుందన్నారు. కొత్త ఖాతా తెరుచుటకు ఆధార్ కార్డు, రెండు ఫోటోలు, ఫోన్ నెంబర్ ఉంటే సరిపోతుందన్నారు. ఇతర వివరాలకు సమీప ఎస్బీఐ బ్యాంక్ శాఖలో సంప్రదించాలని కోరారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు మంగళవారం హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 35 మంది వ్యక్తులను మేజిస్ట్రేట్ ఏ.వేణు గోపాల్ ఎదుట హాజరుపర్చారు. ఈ సందర్భంగా గుంజి దుర్గప్రసాద్, కురిమిళ్ల శివరామకృష్ణ, మార్క ప్రేమ్ కుమార్ ఈ ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మిగతా 32 మందికి కలిపి రూ.32,700 జరిమానా విధించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన 8 మందిని కోర్టుకు హాజరుపరచగా వారికి రూ.4,000 జరిమానా విధించారు. మైనర్ డ్రైవింగ్ రెండు కేసుల్లో ఇద్దరు R2 లకు రూ.1,500 జరిమానా విధించామని హనుమకొండ ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపారు.

# రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాజ్యాంగ పరిరక్షణ నేపథ్యంలో "జై బాపు – జై భీమ్ – జై సంవిధాన్" అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నేతృత్వంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 11వ, 29వ డివిజన్లలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రను 29వ డివిజన్ పాపయ్యపేట జంక్షన్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని సమర్థంగా అమలు చేయడం, అంబేద్కర్ ఆశయాలను కొనసాగించడం కీలకమని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రస్తుత అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించబడిందని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నాయని, అంబేద్కర్‌ను నిరాకరిస్తూ వ్యవహరిస్తున్నదని ఆయన ఆరోపించారు. పార్లమెంటు సాక్షిగా బీజేపీ నాయకులు అమిత్ షా వంటి వారు అంబేద్కర్‌ను అవమానించారని విమర్శించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచాలనే ఉద్దేశంతో ఈ పాదయాత్ర చేపట్టబడినట్లు తెలిపారు. గత పదేళ్లుగా బీజేపీ పాలన ప్రజాస్వామ్యాన్ని ఖండిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి బడా బాబులకు ప్రాధాన్యత ఇస్తున్నారని, పేద ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదని విమర్శించారు. అంబేద్కర్ సిద్ధాంతాలు, ఆశయాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం ఇదేనని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ విజయలక్ష్మి సురేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్ బుద్ధా జగన్, బంక సంపత్ యాదవ్, మహమ్మద్ సమద్, డివిజన్ అధ్యక్షులు ఓరుగంటి పూర్ణ, గన్నారపు సంగీత్ కుమార్, మాడిశెట్టి రాజ్ కుమార్, గోల్కొండ సాంబయ్య, గన్నారపు కమల్, ముప్పు సతీష్, సయ్యద్ అజ్గర్, మహమ్మద్ రఫీ, శ్రీరాముల సురేష్, మెడకట్ల సుకుమార్, గడ్డం రమేష్, రోహన్, గాడిపల్లి మహేష్, మాలతీ, ఝాన్సీ, ఇమ్మడి డోర్తి పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ




**వరంగల్ వాయిస్, జనగామ :** కాన్రాజు ఉదయశ్రీ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఆమె తల్లిదండ్రులు కాన్రోజు నాగలక్ష్మి–రవి ఆధ్వర్యంలో జనగామ మండలం షామీర్ పేట గ్రామంలో ఉన్న రుద్రమదేవి వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించి, బియ్యం నిత్యావసర సరుకులు, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయశ్రీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ ఆలోచన, ఆశయంలో మంగళవారం ఉదయ శ్రీ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ కుర్మ, రుద్రమదేవి ఆశ్రమ నిర్వాహకులు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రవేశాలు పెంచాలి




**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పర్వతగిరి పాఠశాలలో యూపీఎస్ బూరుగుమల్ల, అన్నారం, దౌలత్ నగర్ జంట పాఠశాలలతో జంట పాఠశాలల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంప్లెక్స్ ప్రిన్సిపాల్ పాక్ రమేష్ బాబు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన లింగా రెడ్డి మాట్లాడుతూ, ఈ జంట పాఠశాలల కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తుందని, మన మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దీనికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కలిసి పనిచేసి వచ్చే ఏడాది విద్యార్థుల ప్రవేశాలను పెంచాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మడత శ్రీనివాస్, సోమేశ్వర్, మదిలిమాయే, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## అనాథలకు ఆసరా.. మనం స్వచ్ఛంద సంస్థ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ప్రాంతంలోని అనాథ శరణాలయంలో ఉంటూ చదువుకునే అమ్మాయి అంజలి ఉన్నత చదువులకు ఎంసెట్ శిక్షణ తీసుకోవాలని పరితపిస్తున్న తరుణంలో ఆమెలోని తపన చూసి "మనం స్వచ్ఛంద సంస్థ " సభ్యులు ముందుకొచ్చి అంజలికి ఎంసెట్ కోచింగ్ ఇప్పించనున్నట్లు మనం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గోళ్ల రాజేంద్ర ప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా గోళ్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి అనాథ శరణాలయంలోనే పెరుగుతూ తెలుగు మీడియం పాఠశాలలో తన విద్యాభ్యాసం కొనసాగిస్తున్న అంజలి ఉన్నత చదువులు చదవాలని ఆశతో ఎదురుచూస్తూ ఎంసెట్ లో మంచి ర్యాంకు తెచ్చుకొని తాను ఒక డాక్టర్ కావాలనుకుంటున్నానని అంజలి తెలపింది. ఆమెలోని పట్టుదల చూసిన మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు చేరదీసి ఆమెకి ఎంసెట్ కోచింగ్ ఇప్పించడానికి ముందుకు వచ్చారు. మంగళవారం ఆమెని నగరంలోని ఒక ప్రైవేటు కోచింగ్ సెంటర్ లో చేర్పించారు. ఆమెకి విద్యతో పాటు హాస్టల్ సదుపాయానికి కూడా తాము ఫీజు చెల్లించినట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. ఆ అమ్మాయి ఉన్నత చదువులు చదివి సమాజానికి ఉపయోగపడే ఒక మంచి డాక్టర్ గా ఎదగాలని కోరుకుంటున్నామని వారు తెలిపారు. సహాయం చేసినందుకు మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు శైలేష్, దీపిక, నాగరాజు, మనం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గోళ్ల రాజేంద్ర ప్రసాద్, మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులకు ఆ బాలిక ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఒప్పంద అధ్యాపకులను పర్మినెంట్ చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న 1270 మంది ఒప్పంద అధ్యాపకులను బేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ, మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయం ప్రధాన పరిపాలన భవనం ఎదుట అధ్యాపకులు పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయ ఒప్పంద అధ్యాపకుల సంఘం పిలుపు మేరకు తరగతులను బహిష్కరించి ఈ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నేతలు డాక్టర్ కర్ణాకర్ రావు, డాక్టర్ శ్రీధర్ కుమార్ లోతు మాట్లాడుతూ, గతంలో అనేక సార్లు తాము గత ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఒప్పంద అధ్యాపకులను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 4న విడుదల చేసిన జీవో నెంబర్ 21 తమకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చదని, ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు యూజీసీ 7వ పే స్కేలు ప్రకారం బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్ఏ, 3% వార్షిక ఇంక్రిమెంట్ లభించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ స్పందన లేనిచో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తర్వాత వారు కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డిని కలిసి తమ డిమాండ్లను వివరించిన వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన ఉపకులపతి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో డాక్టర్ సాధు రాజేష్, డాక్టర్ సతీష్, డాక్టర్ వీణ, డాక్టర్ ఆశీర్వాదం, డాక్టర్ అంజన్న రావు, డాక్టర్ గడ్డం కృష్ణ, ఆర్. డి. ప్రసాద్, డాక్టర్ కే. మధుకర్ రావు, డాక్టర్ భిక్షపతి, డాక్టర్ లక్ష్మారెడ్డి, డాక్టర్ సునీత సుజాత, డాక్టర్ సంగీత్ కుమార్, డాక్టర్ బ్లెస్సీ ప్రియాంక, శ్రీలత, సుచరిత, పాల్ సత్యజూల, డాక్టర్ సదాశివ, డాక్టర్ నాగేశ్వరరావు, తూర్పాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా బ్రాహ్మణ సదస్యం



**వరంగల్ వాయిస్, రంగశాయిపేట :** వరంగల్ నగరంలోని రంగశాయి పేటలో మంగళవారం ఉదయం హోమ కార్యక్రమం, బలిహరణ, మధ్యాహ్నం బ్రాహ్మణ సదస్య కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో నాల్గవరోజు మంగళవారం సాయంత్రం గరుడ వాహనంపై (చిన్నరథం) సీతారాములు ఊరేగింపుతో డప్పు, చప్పులతో పుర వీధిలో స్వామి వారిని ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. భక్తులు స్వామివారి రథం కురుమ కుల కర సేవకులు భక్తులు రథాన్ని లాగుతూ జైశ్రీరామ్ జై జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ రథాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఇంటి ముందుకు రాగానే మంగళ హారతులు కొబ్బరికాయలు కట్న కానుకలు స్వామివారికి సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థల దాతలు వద్దిరాజు శ్యాంసుందర్రావు, లక్ష్మీకాంతరావు, వేద బ్రాహ్మణులు ఫౌండ్రి ట్రస్ట్ చైర్మన్ పులిగిల్ల వెంకటరామ నరసింహ శాస్త్రి, ఆలయ ప్రధాన పూజారి తిరుమల శ్రీధరాచార్యులు, దేవదాయ శాఖ కార్యనిర్వాక అధికారి వెంకట్రావు, ఆలయ ఉత్సవ కమిటీ శ్రీరామ భజన మండలి సభ్యులు, కురుమ కుల కర సేవకులు పాల్గొన్నారు.

# రజితోత్సవ సభకు భారీగా తరలించాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ రజితోత్సవ సభను విజయవంతంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ పరకాల మండల పార్టీ అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన సమన్వయ కమిటీ సభ్యుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో బీఆర్ఎస్ అభిమానులను తరలించాలనీ, సభను విజయవంతం చేయాలనే తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

# కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, జనగామ:** పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు, గృహ వసరులకు వినియోగించే వంట గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం 50 రూపాయలు చొప్పున పెంచడాన్ని నిరసిస్తూ జనగామ పట్టణ కేంద్రంలోని నెహ్రూ పార్క్ దగ్గర మంగళవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ మాట్లాడుతూ గ్యాస్ ధర పెంచడం వలన నిత్యావసర సరుకుల ధరలు అన్ని పెరిగి సాధారణ ప్రజలపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి పెంచిన గ్యాస్ ధర, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, లేకపోతే కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం ప్రజలు చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జనగాం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, భూక్య చందు నాయక్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, పల్లెర్ల లలిత, బొట్ల శ్రావణ్, మంగ బీరయ్య, పాము శ్రీకాంత్, శాఖ కార్యదర్శిలు భూనాద్రి వెంకటేష్, గంగరబోయిన మల్లేష్ రాజ్, సాంబరాజు, దుర్గాప్రసాద్, కుమార్, మాదా సుధాకర్, బండ సౌందర్య, అజ్మీర సురేష్, నాయక్ లక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాస పథకం పక్కాగా అమలు చేయాలి

### అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణికి వినతి పత్రం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా యువమోర్చా వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పదాధికారుల సమావేశం మంగళవారం నిర్వహించబడింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాస పథకం పై తీవ్ర చర్చ జరిగింది. పథకం అమలులో స్పష్టత లేకపోవడం, లబ్ధిదారులకు ఉత్పత్తిదారునిగా మారేందుకు సరైన పథక రూపకల్పన లేకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ, దీనిపై తక్షణమే సమీక్ష నిర్వహించి ఒక ప్రణాళికా బద్ధమైన చర్యా విధానాన్ని రూపొందించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ వీర్ యాదవ్ గారి నేతృత్వంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆనగందుల శ్రవణ్, జిల్లా జనరల్ సెక్రటరీ రాపాక ప్రశాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాళ్ల బండ మున్న డివిజన్ అధ్యక్షులు ఉప్పుల వినయ్, పెండోట మహంత్ పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారుల సదస్సు



**వరంగల్ వాయిస్ ,చిట్యాల :** మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించే విద్యుత్ వినియోగదారుల సదస్సును వినియోగదారులందరు సద్వినియోగం చేసుకోవాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్ వేణుగోపాల చారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన మీటర్లు మార్చుట, లో వోల్టేజ్ హెచ్చుతగ్గులు, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం వంటి సమస్యలను పరిష్కరించు కోవచ్చని తెలిపారు. బుధవారం ఉదయం 10 నుంచి 1 గంట వరకు మండల కేంద్రంలోని రైతు వేదికలో సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# ఎంబీబీఎస్ కోర్సులో పరకాల విద్యార్థిని ప్రతిభ




**వరంగల్ వాయిస్, పరకాల :** ఎంబీబీఎస్ కోర్సులో 6 మెడల్స్ సాధించి పరకాల విద్యార్థి ప్రతిభ చూపింది. పరకాలకు చెందిన ఆరెపల్లి పావన సుధ నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ను ఇటీవల పూర్తి చేసింది. కాగా, ఎంబీబీఎస్ కోర్సులో ఐదు సబ్జెక్టులలో డిస్టింక్షన్ సాధించిన పావనసుధ ఇటీవల నిర్వహించిన డిగ్రీ పట్టా ప్రదానంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శివ ప్రసాద్, గాంధీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా చేతుల మీదుగా మెడళ్లను అందుకుంది. కాగా 6 మెడళ్లను అందుకున్న పావన సుధను కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా పావనసుధ మాట్లాడుతూ ఎమ్మెస్ జనరల్ సర్జన్ పూర్తి చేసి జీవితంలో పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

# వ్యవసాయ కార్మికుల డిమాండ్ల సాధనకు పోరాటం

- జూన్ 10న కలెక్టరేట్ల ఎదుట భారీ ధర్నాలు
- తాటిపాముల వెంకట్రాములు
- జూలైలో రాష్ట్ర మహాసభలు- కాంతయ్య




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం సమర శంఖం పూరించేందుకు జూన్ 10న రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు జయప్రదంగా నిర్వహించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. హైదరాబాద్ హిమాయత్నగర్లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్లో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కలకొండ కాంతయ్య, జూలైలో రాష్ట్ర మహాసభల నిర్వహణకు మండల, జిల్లా స్థాయిలో మహాసభల్ని నిర్వహించేందుకు సిద్ధమవ్వాలని సూచించారు. అలాగే, మోడీ పాలనలో రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని, అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

కలకొండ కాంతయ్య ప్రసంగిస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలు జూలై మాసంలో నిర్వహిస్తున్నామని, ఈ లోగా మండల, జిల్లా మహాసభల నిర్వహించేందుకు సన్నద్ధం కావాలన్నారు. వ్యవసాయకూలీలకు సంవత్సరానికి రూ.12వేలు, ఆసరా పెన్షన్ 4వేలు, మహిళలకు రూ.2500 ఎన్నికలవాగ్దానాలను అమలుపరచాలని ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు, బుద్దుల జంగయ్య, అక్కపల్లి బాబు, తాజుద్దీన్, చింతకుంట్ల వెంకన్న,కర్రెలక్ష్మణ్, టి. శంకర్, యల్.శ్రవణ్ కుమార్, బి.నరసింహ, మహాలక్ష్మి, లక్ష్మయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్‌తో కలిసి రండి

## ➲ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్




**వరంగల్ వాయిస్, పరకాల:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే దిశగా ప్రయత్నాలు చేస్తోందని, ప్రజలంతా రాజ్యాంగ పరిరక్షణను తమ బాధ్యతగా తీసుకుని కాంగ్రెస్ పార్టీతో కలవాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 4, 5వ వార్డుల్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి "జై బాపు – జై భీమ్ – జై సంవిధాన్" కార్యక్రమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి గొప్ప నాయకుల నాయకత్వంలో రూపొందిన భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, ఏఐసీసీ ఆదేశాల మేరకు ఈ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగం ప్రకారం అన్ని వర్గాలకు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, అవకాశాలు అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం 400 సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చుతామని ప్రకటించి, క్రమంగా ఆ దిశగా అడుగులు వేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ కుట్రను తిప్పికొట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే "జై బాపు – జై భీమ్ – జై సంవిధాన్" కార్యక్రమ ఉద్దేశ్యమని వివరించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అనుసరించి అన్ని వర్గాలకు అవకాశాలు కల్పిస్తోందని, అందుకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎంపీపీ ఉంటే రామ్మూర్తి, చిన్నాల గోనాథ్, పసుల రమేష్, మార్క రఘుపతి గౌడ్, నల్లెల అనిల్, ఎకు సారయ్య, చెరుపెల్లి మొగిలి, దావు పరమేశ్వర్, ఏకు రవి, బొచ్చు కుమార్, దామా అనిల్, గోవింద్, రాజేందర్, ఎండీ యాకూబ్, ఎండీ రజియా సుల్తానా, గోవింద ప్రకాష్, ఏకు రమేష్, బుచ్చు రవి, జితేందర్, ఏకు బొబ్బిలి, గొట్టే రమేష్, జైపాల్, ప్రశాంత్ కుమార్, రాజేష్, నాల్గవ, ఐదవ వార్డుల ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యలు వద్దు.. జీవితం ముద్దు



## ➲ సుప్రీం కోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ

**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** ఆత్మహత్యల నుంచి దూరంగా ఉండాలని, ఎలాంటి కష్టాలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొని జీవితం పట్ల ప్రేమతో ఉండాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ పిలుపునిచ్చారు. మంగళవారం నాడు న్యూఢిల్లీలోని మ్యాక్స్ ముల్లర్ మార్గ్ లోని దేశ్ ముఖ్ ఆడిటోరియంలో జరిగిన "ఆత్మహత్యల నివారణ సదస్సు"లో ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సు ప్రముఖ సామాజిక కార్యకర్త, రూరల్ అగ్రికల్చర్ డెవలప్మెంట్ సొసైటీ అధినేత మదన్మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించబడింది. లీగల్లీ వీర్ చిత్ర కథానాయకుడు వీర్ రెడ్డితో కలిసి జస్టిస్ గోపాల గౌడ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఆత్మహత్యల నివారణ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఆత్మహత్యలు చేసే సమయంలో వ్యక్తులు తీవ్ర మనోవేదనలో ఉంటారు. అటువంటి వారికి మనం మానసికంగా భరోసానిచ్చే ప్రయత్నం చేయాలి. 'మీతో పాటు మేమున్నాం'అనే సందేశాన్ని ఇవ్వగలిగితే వారు ఆ విషాద స్థితిలో నుంచి బయటపడగలుగుతారు"అని తెలిపారు. వీర్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ అశోక్ పరికిపండ్ల గత 25 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాలలో ఆత్మహత్యల నివారణకు గణనీయమైన కృషి చేస్తున్నారని, ఇప్పటివరకు 28 మంది ప్రాణాలను రక్షించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది ప్రకాష్ సింగ్, లీగల్లీ వీర్ చిత్ర నటి లికిత గోయల్, ఢిల్లీ యూనివర్సిటీ ఆచార్యులు వసంత్ మిత్ర, డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# అన్ని దానాల కన్నా.. అన్నదానం గొప్పది

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని బాలసముద్రంలో మల్లికాంబ మానసిక దివ్యాంగుల మనోవికాస కేంద్రంలోని హనుమకొండ, రాంనగర్ కు చెందిన భూక్యా శకుంతల ద్వితీయ కుమారుడు భూక్యా కృష్ణ తేజ గత ఏడాది మరణించడంతో వారి పుట్టినరోజును పురస్కరించుకుని వారి జ్ఞాపకార్థంతో కుటుంబ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ 'అన్నం' అంటే ఆహారం, 'దానం' అంటే ఇవ్వడం లేదా దానం చేయడం అని అన్నదానాన్ని వివిధ రకాల దానంలో 'మహాదానం' అని అంటారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అన్నదానానికి మించి ఏది లేదని, అన్నదానం చేస్తే భవిష్యత్తులో శుభ ఫలితాలు కలుగుతాయని అన్నారు. అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని ఎందుకంటే ఒకపూట భోజనం పెట్టి ఆకలితో ఉన్న వారి కడుపు నింపవచ్చని ఇలా మానసిక దివ్యాంగుల కడుపు నింపడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



# ఊట్ల తోగు గొత్తికోయ గూడెం సందర్శన



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మంగళవారం వెంకటాపూర్ మండలం బూరుగుపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో గల ఊట్ల తోగు గొత్తికోయ గూడెంను ఆర్ డబ్ల్యూఎస్ డీఈ సునీత సందర్శించారు. సుమారు 10 కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతంలో బండిపై వెళ్లిన డీఈ సునీత ముందుగా గ్రామస్తులతో మాట్లాడి తాగు నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా తాగు నీటి సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీంచారు. అనంతరం డీఈ సునీత గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గొత్తి కోయ గూడాల్లో తాగు నీటి సమస్య ఉండకూడదనే ఉదేశ్యంతో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు గొత్తి కోయ గూడాల్లో పర్యటించడం జరుగుతుందని ఆమె తెలిపారు. అందులో భాగంగానే తాము ఊట్ల తోగు గొత్తి కోయ గూడెంను సందర్శించటం జరిగిందని అన్నారు. తాగు నీటి వసతి కల్పించేందుకు ఏర్పాట్లను పరిశీలించటం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్ ఉన్నారు.

# విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూలైవాడ విద్యార్థులకు వరంగల్ కు చెందిన హెల్పింగ్ హాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం వాటర్ బాటిల్స్ ను ఉచితంగా పంపిణీ చేశారు. హెల్పింగ్ హాండ్స్ సొసైటీ, అధ్యక్షులు రామకృష్ణ ఏకాదశిని పురస్కరించుకొని దాతలు వంకాయల కళ్యాణ్, లావణ్య దంపతులు, వారి కుమారుడు సాయి యశ్విత్, కుమార్తె అక్షర ఆర్థిక సహకారంతో 200 వాటర్ బాటిళ్లను వేసవిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వేసవిలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలి

## రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వేసవి సెలవు దినాలలో విద్యార్థిని విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని జనగామ రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, సబ్ ఇన్ స్పెక్టర్ దూడిమెట్ల నరేష్ యాదవ్ లు పిలుపునిచ్చారు. మంగళవారం రఘునాథపల్లి మండలం కంచన పెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని మరికొందరికి అవగాహన కల్పించాలన్నారు. చదువుకున్న వారు కూడా ఇటీవల సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారని, ఆ విషయం ఆందోళన కలిగిస్తుందన్నారు. కొరియర్ పేరుతోను మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. లోన్ యాప్.. లాటరీల పేరుతోను డెబిట్ కార్డ్ మోసాలుకు జరుగుతున్నాయని వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో ఫేక్ ఫొటోలను చూపి ఆకర్షణ లోనై మోసపోతున్నారన్నారు. నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు.సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ వస్తే సమాచారం పోలీసులకు ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులు వాహనాలు నడపవద్దని, త్రిబుల్ రైడ్ చేయవద్దని, వేసవి సెలవుల్లో చెరువులో ఈతకు పోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

## రామ రాజేష్ ఖన్నా




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న 17,541 మంది ఉద్యోగులకు రావలసిన ఏడునెలల పీఆర్సీ బకాయిలు (జూలై 2021 నుంచి జనవరి 2022 వరకు) వెంటనే విడుదల చేయాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగుల వేతనాలు సకాలంలో రాకపోయినా వారు ప్రజాసేవలో ముందుండి సేవలు అందిస్తున్నారని, అయితే వారికీ రావాల్సిన ఏరియర్స్ ఇప్పటికీ ఇవ్వకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, 1994లో అమలులోకి వచ్చిన కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యాక్ట్ ప్రకారం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి పనిచేస్తున్న ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాలపై గమనించి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సన్న బియ్యంతో సహపంక్తి భోజనం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సన్నబియ్యం కార్యక్రమాన్ని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండె నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో శాంతినగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జన్ను వేణు నివాసంలో సన్నబియ్యం భోజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య హాజరై, జన్ను వేణు కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టినందుకు ఆయనకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేశ్వర్, మాజీ కౌన్సిలర్ ధూపం సంపత్, జన్ను రవి, గోరంటల రాజు, కరాటే ప్రభాకర్, మాజీ కార్పొరేటర్ తత్తర లక్ష్మణ్, పెండ్యాల కొమురయ్య, తోట బాలరాజు, చాగంటి శ్రీనివాస్, సందెల దామోదర్, శేఖర్, చిరంజీవి, స్వరాజ్, గోవర్ధన్, కొడా రీబాబు, మార్త ఆంజనేయులు, శ్వేతబాబు, శ్రీనివాస్, జంజీరాల వేణు, రావుల సుదర్శన్, ఉమేందర్, దేవరాజ్, వంశీ, ప్రశాంత్, లడ్డు, రాజన్ బాబు, శివ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సోదరీమణులు, స్థానికులు ల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** విజ్ఞానంతో పాటు పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు గ్రంథాలయాలకు వస్తున్న పాఠకులు, విద్యార్థులు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని బీజేపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రెహ్మాన్ అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వార్తా పత్రికలు, వివిధ పోటీ పరీక్షల పస్తకాలు చదివేందుకు ఇక్కడికి వస్తున్న విద్యార్థుల దహార్తి తీర్చేందుకు చలివేంద్రాని ఏర్పాటు చేసామన్నారు. వేసవి ముగిసే వరకు గ్రంథాలయంలో చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. ప్రజలు చలివేంద్రాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దేవా, జిల్లా కౌన్సిలర్ మెంబర్ లక్కన్ వ్యాస్, మండల అధ్యక్షులు గణేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి కళ్యాణ్, హనుమంతు, లాల్ సింగ్, ఆవుదుర్తి బిందు, రవి, అశోక్, సుమన్ నాయక్, బోడ హటియా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాజ్యాంగాన్ని అవమానించింది




**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** అంబేద్కర్ ను అవమానించటమంటే రాజ్యాంగాన్ని అవమానించటమేనని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యాక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. జై బాపు– జై భీమ్–జై సంవిధాన్ అనే నినాదంతో మండలంలోని జోగ్యతండా, బోడ్రాయితండా, పెరుమండ్ల సంకీసా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. రాజ్యాంగంతో పాటు మహాత్మా గాంధీ వారసత్వాన్ని కాపాడటం కోసం, డాక్టర్ అంబేద్కర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను పదవి నుంచి తొలగించాలనే డిమాండ్ చేస్తూ జై బాపు–జై భీమ్–జై సంవిధాన్ నినాదంతో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల పోరాట ఫలితంగానే తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలు అందించామని వివరించారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేస్తే తప్పక అవకాశాలు వస్తాయని భవిష్యత్తులో తప్పకుండా ప్రతి కార్యకర్తకు అవకాశం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాశీరాం, గండు బాబు, తేజావత్ వెంకన్న, కాసం శేఖర్, రమేష్, ఆంగోత్ వెంకన్న తదితరుల పాల్గొన్నారు.

## కోటగుళ్లలో మరుగుదొడ్లను వెంటనే ప్రారంభించాలి

### బీజేవైఎం రాష్ట్ర కన్వీనర్ మంద మహేష్



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని కోటగుళ్లలో టూరిజం ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లను వెంటనే ప్రారంభించాలని బీజేవైఎం కళాశాలల విభాగం రాష్ట్ర కన్వీనర్ మంద మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రితం మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభమైందని, పనులు పూర్తయి ఆరు నెలలు కావస్తున్న ఇప్పటివరకు ప్రారంభించడం లేదన్నారు. దీంతో కోటగుళ్లకు వచ్చే పర్యాటకులు ముఖ్యంగా మహిళలు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, టూరిజం శాఖ వారు స్పందించి వెంటనే మరుగుదొడ్లను ప్రారంభించి వాడుకలోకి తేవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి చెలిమల్ల ప్రవీణ్ కుమార్, బీజేవైఎం నాయకులు కర్క అన్వేష్, చరణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కాశిబుగ్గ చౌరస్తాలో మజ్జిగ పంపిణీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో మంగళవారం లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం ఉపాధ్యక్షుడు దాసి శివకృష్ణ–దీప్తి కుమారుడు దాసి సుహాస్ కృష్ణ, కుటుంబ సభ్యులతో కలిసి మజ్జిగ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి, సంఘం అధ్యక్షులు వంగరి రాంప్రసాద్, కోశాధికారి దుస్సా కృష్ణ, ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, వంగరి రవి, గాదె జగన్, క్యాతం శ్రీనివాస్, కానుగంటి పవన్, గాజుల రాజేష్ , బండారి లక్ష్మణ్, క్యాతం రవీందర్, ములుక సురేష్, ఆమంచ భువన్ ప్రకాష్, వంగ ఐలయ్య, కూరపాటి సతీష్ కుమార్, కోట నగేష్, దాసి రామచంద్రం, క్యాతం వీరాస్వామి, ఆడెపు పాపయ్య, క్యాతం లక్ష్మీనారాయణ, కందగట్ల కమలాకర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మాచర్ల లీల కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన స్వర్గీయ మాచర్ల లీల 5వ రోజు కార్యక్రమం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ తొలి స్పీకర్ ఓఎస్డీ, రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, ప్రముఖ న్యాయవాది గడ్డం సుధాకర్, సమీప బంధువులు బండ కాళిదాస్, కూచన దశరథం తదితరులు హాజరై లీల చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె భర్త మాచర్ల వెంకటేశ్వర్లను పరామర్శించారు. ఈనెల 4న మృతి చెందిన మాచర్ల లీల పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీపీ సన్‌ప్రీత్ సింగ్, ఏసీపీ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 22 మంది వ్యక్తులను మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశం ఎదుట హాజరు పరిచారు. ఈ సందర్భంగా కావేరి నాగేష్‌కు ఒక రోజుల జైలు శిక్ష విధించగా, తీరులపురం శివుడుకు రూ.1000 జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. వారిద్దరినీ పరకాల సబ్ జైలుకు పంపించారు. మిగిలిన 20 మంది వ్యక్తులకు కలిపి రూ.20,800 జరిమానా విధించారు. ఇంకా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన వ్యక్తులను కోర్టులో హాజరు పరచగా, వారికి ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు.

## రైతులు ఎవరు ఆందోళన చెందొద్దు

### జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను సేకరిస్తున్నామని, పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్. అన్నారు. మంగళవారం మంగపేట మండలం నర్సింహసాగర్ గ్రామంలో అకాల వడగళ్ల వాన కారణంగా దెబ్బతిన్న పంటలను అదనపు కలెక్టర్ రెవిన్యూ సీహెచ్ మహేందర్ జి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నష్టపోయిన రైతులను నష్టపోయిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ నష్టపరిహారం అందే విషయంలో రైతులు ఎవరు ఆందోళన చెందావద్దని, దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి వెంటనే తమకు అందజేయాలని సంబంధిత వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం దెబ్బతిన్న పంటల వివరాలను అందచేయాలని ఆదేశించడం జరిగిందని, నష్టపోయిన రైతుల వివరాలను సేకరిస్తున్నామని వివరించారు. అనంతరం మల్లూరులోని శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామీ దేవాలయంను కలెక్టర్ సందర్శించి, మే నెలలో జరుగనున్న బ్రహ్మోత్సవాలకు కావలసిన ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పోషణలోపం ఏ ఊర్లో కనిపించకూడదనే లక్ష్యంతో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని మండలంలోని మడిపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసీడీపీఓలు ఇందిరమ్మ, విజయలక్ష్మిలు పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. బాల, బాలికలకు, గర్భవతులకు ముఖ్యంగా పేదవారి పిల్లలకు,పేద మహిళలకు పౌష్టికరమైన ఆహారం అంగన్వాడీల ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. గర్భిణీలు బాలింతలు అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిస్తూ ఒక సాధారణ అంగన్వాడీ కేంద్రం ఒక గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ గౌసియా, గ్రామ సెక్రెటరీ శోభారాణి,అంగన్వాడీ టీచర్లు అరుణ, ఉదయశ్రీ, సుజాత అంగన్వాడి ఆయాలు సమ్మక్క, సరిత, గర్భిణీలు బాలింతలు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# దానికి వయసుతో పనిఏముంది..

### ఏజ్‌గ్యాప్‌పై కౌంటరిచ్చిన మాళవిక



మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ ప్రస్తుతం హృదయపూర్వం చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మాళవిక మోహనన్ కథానాయికగా నటిస్తుంది. సత్యన్ అంతికాడ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం షూటింగ్ మొదటి షెడ్యూల్ పూర్తయినట్లు ప్రకటిస్తూ మాళవిక మోహనన్ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఒక పోస్ట్‌ను పంచుకున్నారు. దీంత ఆమె పోస్ట్ పై నెటిజన్స్ ట్రోల్స్ చేశారు. మోహన్‌లాల్, మాళవిక మధ్య వయస్సు వ్యత్యాసం గురించి కామెంట్స్ చేశారు. దీంతో తన గురించి వచ్చిన నెగటివ్ కామెంట్స్ పై మాళవిక తీవ్రంగా స్పందించింది. ''నువ్వు ఇలా మనుషులను ఎలా తూకం వేస్తావో తెలుసా?'' నటులకు , నటనకు సంబంధం లేదని, దానికి వయసుతో పని ఏముందని అంటూ కౌంటరిచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరలవుతుంది. మాళవిక మోహనన్, నటుడు మోహన్ లాల్ తో కలిసి సినిమా సెట్స్ పై ఫోటోస్ పంచుకుంది. మోహన్‌లాల్ సర్ సత్యన్ సర్ వంటి ప్రముఖుల నుండి నేను చాలా నేర్చుకున్నాను. సినిమాలో వాళ్ళు మ్యాజిక్ చేసే విధానం నన్ను ఆకట్టుకుంది అంటూ రాసుకొచ్చింది. చాలా ప్రతిభావంతులైన వ్యక్తులతో కలిసి పనిచేశానని, తెక్కడిలోని అందమైన కొండలు, తేయాకు తోటలలో సంతోషంగా ఒక నెల గడిపానని తెలిపింది. ప్రస్తుతం మాళవిక మోహనన్ ప్రభాస్ సరసన రాజాసాబ్ చిత్రంలో నటిస్తుంది.

# బేబి హీరోయిన్‌కు ఆఫర్లు



బేబీ సినిమాతో తెలుగు చిత్రపరిశ్రమలో స్టార్ డమ్ సంపాదించుకుంది హీరోయిన్ వైష్ణవి చైతన్య. దీంతో ఈ బ్యూటీకి తెలుగులో వరుస ఆఫర్స్ వచ్చాయి. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ సరసన జాక్ చిత్రంలో నటిస్తుంది ఈ వయ్యారి. ఈ మూవీ ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలకానుంది. ఈ క్రమంలోనే జాక్ మూవీ ప్రమోషన్లలో భాగంగా సిద్ధు, వైష్ణవి ఫుల్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల భీమవరంలోని విష్ణు కాలేజీలో నిర్వహించిన ఈవెంట్లో జాక్ చిత్రయూనిట్ సందడి చేసింది. ఈ కార్యక్రమంలో అక్కడి విద్యార్థులతో సిద్ధు, వైష్ణవి ఇంట్రాక్ట్ అయ్యారు. అక్కడి స్టూడెంట్స్ చేసిన అల్లరి, డ్యాన్సులు చూసి మురిసిపోయారు. ఈ క్రమంలోనే స్టేజ్ మీద వైష్ణవి మాట్లాడుతూ స్టూడెంట్ లైఫ్, కాలేజీ జీవితం గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. అదే సమయంలో భీమవరంలో అని మర్చిపోయి రాజమండ్రి అనేసింది. ప్రస్తుతం జాక్ సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉంది హీరోయిన్ వైష్ణవి చైతన్య. కొన్ని రోజులుగా హీరో సిద్ధు జొన్నలగడ్డతో కలిసి పలు ఇంటర్వ్యూలు, ఈవెంట్లలో పాల్గొంటుంది. తాజాగా భీమవరంలో జరిగన ఈవెంట్లో పాల్గొన్న ఈ బ్యూటీ ఆ ఊరు పేరునే మర్చిపోయింది. దీంతో ఆమెకు హీరో సిద్ధు జొన్నలగడ్డ సాయం చేశారు.

# ధనుష్‌పై.. పైచేయి



కోలీవుడ్‌లో ఇప్పుడు మీడియం హీరోలదే హవా! యాంకర్‌గా వచ్చి ఆపైన సినిమాల్లోకి వచ్చి అంచెలంచెలుగా ఎదిగి ఇవాళ తారాస్థాయిని చేరుకున్నాడు శివ కార్తికేయన్. అయితే... తమిళ చిత్రసీమలో ఇవాళ ఏ స్థాయి హీరోకూ సాలీడ్ హిట్స్ అనేవి పడటం లేదు. అజిత్ కు మంచి విజయం దక్కి చాలా కాలమే అయ్యింది. దాంతో అతని అభిమానులు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మీదే ఆశలు పెట్టుకున్నారు. ఇక విజయ్ ఇప్పుడు సినిమాల మీద కంటే... రాజకీయాల మీదనే ఎక్కువ దృష్టి పెడుతున్నాడు. ఇక రజనీకాంత్ 'జైలర్' సక్సెస్ తర్వాత వచ్చిన 'లాల్ సలామ్' ఆడలేదు. దాంతో ఆగస్ట్ 14న రాబోతున్న 'కూలీ'తో ఆయన తిరిగి సక్సెస్ ట్రాక్ ఎక్కుతాడని నమ్ముతున్నారు. కమల్ హాసన్ నటించిన 'విక్రమ్' మంచి విజయాన్ని అందుకున్నా... ఆ తర్వాత సోలోగా చేసిన 'ఇండియన్ –2' పరాజయం పాలైంది. ఇక విక్రమ్, శింబు, సూర్య, కార్తీ వంటి వాళ్ళు కూడా జయాపజయాలతో కుస్తీలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శివ కార్తికేయన్ మూవీ 'అమరన్' దీపావళి కానుకగా వచ్చి ఏకంగా రూ. 300 కోట్ల గ్రాస్‌ను వసులూ చేసింది. ఈ మూవీతో అతను ఓవర్ నైట్ బిగ్ స్టార్ గా మారిపోయాడు. ప్రస్తుతం శివ కార్తికేయన్ సుధా కొంగర దర్శకత్వంలో 'పరాశక్తి' మూవీ చేస్తున్నాడు. ఈ సినిమాకు అతను ఏకంగా రూ. 30 కోట్ల పారితోషికం తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. చిత్రం ఏమంటే... హాలీవుడ్ సినిమాల్లో సైతం నటించిన ధనుష్ కూడా ఇంత రెమ్యూనరేషన్ డిమాండ్ చేయడం లేదట. ధనుష్ మొన్నటి వరకూ పది కోట్ల రూపాయలను మాత్రమే తీసుకునే వాడని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అతని తాజా చిత్రం 'జాబిలమ్మ నీకు అంతకోపమా' తెలుగులోనే కాదు తమిళంలోనూ ఆడలేదు. ధనుష్ హీరోగా నటించిన 'సార్' సినిమా మంచి విజయాన్ని సాధించింది. గత యేడాది ధనుష్ నటించిన 'కెప్టెన్ మిల్లర్, రాయన్' చిత్రాలు విడుదలయ్యాయి. వాటికి మిశ్రమ స్పందనే లభించింది. దాంతో త్వరలో రాబోతున్న 'కుబేర' మీద ధనుష్ అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. అలానే స్వీయ దర్శకత్వంలో 'ఇడ్లీ కడై' అనే సినిమాలో ధనుష్ హీరోగానూ నటించాడు. అది అక్టోబర్ లో వస్తోంది. మరి ఈ రెండు సినిమాలు హిట్ అయ్యి ధనుష్ సక్సెస్ ట్రాక్ ఎక్కుతాడేమో చూడాలి. సో... ఓవర్ ఆల్ గా చూసుకుంటే... ధనుష్ కంటే కూడా ఇవాళ విజయాలలోనూ, పారితోషికంలోనూ శివ కార్తికేయన్ దే పైచేయిగా ఉంది.

# త్వరలోనే అఖిల్ పెళ్లి డేట్ ..



అక్కినేని మూడో తరం వారసుడు అఖిల్ సినిమాల సంగతేమో కాని పెళ్లి వార్తలతో వార్తలలో వస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం జైనబ్ రవ్జీతో నిశ్చితార్థం జరుపుకున్నారు. అయితే పెళ్లి ఎప్పుడు జరుగుతుందా అని అందరు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుండగా, దానిపై మాత్రం క్లారిటీ ఇవ్వడం లేదు. వీలైనంత తొందరలనే ఈ జంట పెళ్లి పీటలు ఎక్కనున్నట్టు తెలుస్తుంది. అయితే రీసెంట్‌గా అఖిల్, జైనాబ్ ఇద్దరూ జంటగా హైదరాబాద్ విమానాశ్రయంలో కనిపించారు. ఎయిర్ పోర్టులో ఒకరి చేయి ఒకరు పట్టుకుని నడుచుకుంటూ వెళుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. వీరిని ఇలా చూసిన నెటిజన్స్ పెళ్లి కళ వచ్చేసింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఈ జంట చాలా చూడముచ్చటగా ఉందని, పెళ్లి పనులలో వారు బిజీగా ఉన్నారేమో అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మరికొందరు కాబోయే భార్యతో కలిసి బర్త్ డే సెలబ్రేషన్స్ కోసం టూర్ వేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ నెల 8న అఖిల్ పుట్టినరోజు కావడంతో స్పెషల్‌గా పుట్టినరోజు వేడుకలు జరుపుకొనేందుకే ఇద్దరు మంచి ప్లే స్ కి వెళుతున్నారేమో అని, ఇదే అఖిల్ లాస్ట్ బ్యాచిలర్ బర్త్ డే పార్టీ అవుతుందేమో అని క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ఇక అఖిల్ చివరిసారిగా ఏజెంట్ చిత్రంతో ఆడియన్స్‌ని అలరించాడు. ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఇక అఖిల్ కొత్త ప్రాజెక్ట్ ఏంటనేది ఇప్పటి వరకు తెలియజేయలేదు. అయితే అఖిల్ బర్త్ డే సందర్భంగా అప్ డేట్ రానుందని పోస్ట్ పెట్టారు నిర్మాత నాగవంశీ. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళీ కిషోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. అఖిల్ బర్త్ డే సందర్భంగా ఈ నెల 8న అధికారిక ప్రకటన రాబోతోంది. అదే రోజున ఫస్ట్ లుక్ కూడా రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రానికి 'లెనిన్' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. గ్రామీణ బ్యాక్ డ్రాప్‌లో యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందనుందని సమాచారం. ఇందులో శ్రీలీల కథానాయిక అని అంటున్నారు.



# భూ ఆక్రమణను నిరూపిస్తే.. గులాంగిరి చేస్తా

- లేకుంటే పల్లా, తాటికొండ నాకు గులాంగిరి చేయాలి
- చీము, నెత్తురు ఉంటే నా సవాల్ స్వీకరించాలి
- సీనియర్ ను అయినందుకే నాపై ఆరోపణలు
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తనపై చేస్తున్న భూ కబ్జా ఆరోపణలను సాక్ష్యాదారాలతో నిరూపిస్తే వాళ్ళ ఇళ్లల్లో గులాంగా పని చేస్తానని, నిరూపించలేకపోతే వాళ్లు నా ఇంటిలో గులాంగా పని చేయాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ విసిరారు. మీలో నిజంగా తెలంగాణ పౌరుషం ఉంటే, మీ ఒంట్లో చీము, నెత్తురు ఉంటే నా సవాల్ ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణలతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడు, నాలుగు రోజులుగా బీఆర్ఎస్ పార్టీ దిన పత్రిక, టీవీ ఛానల్ లో వచ్చిన వార్త కథనాలు, సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారం, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య చేసిన అటవీ భూముల ఆక్రమణ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ధర్మసాగర్ మండలం దేవునూర్, ముప్పారం, నారాయణగిరి గ్రామాలకు చెందిన రైతులు నన్ను ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని కోరారు. పట్టా భూములను అటవీ శాఖ ఆక్రమణపై రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ ని కలిసి రెవెన్యూ, ఫారెస్ట్ శాఖలతో జాయింట్ సర్వే చేసి హద్దులు నిర్ధారించి రైతులకు న్యాయం చేయాలని కోరడం జరిగిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, ఫారెస్ట్ శాఖ వారు జాయింట్ సర్వే నిర్వహించారు. జాయింట్ సర్వే రిపోర్ట్ లో 23మంది రైతులకు సంబందించిన 43.38 ఎకరాల భూమి పట్టా ఉంది అని తేలిందన్నారు. అటవీ శాఖ డ్రాఫ్ట్ లో లేని ఈ భూమి పట్టా భూమి అని నిర్ధారించారు. ఈ 23మంది రైతులకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పట్టా పాస్ బుక్ లు, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణి ద్వారా జారీ చేసిన పట్టా పాస్ బుక్ లు కూడా ఇచ్చారని, 2017 నుంచి ఈ 23 మంది రైతులకు రైతు బందు ద్వారా ఆర్థిక సహాయం కూడా అందుతున్నట్లు వెల్లడించారు.

### జాయింట్ సర్వే..

అటవీ శాఖ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రపోజల్ ప్రకారం 3,750 ఎకరాలు ఉండాల్సిన అటవీ భూమికి జాయింట్ సర్వే రిపోర్ట్ ప్రకారం 3,955 ఎకరాలు అటవీ శాఖ అధీనంలో ఉంది. దీనిని బట్టి రైతుల పట్టా భూములను కూడా అటవీ శాఖ తమ అధినంలో పెట్టుకొని ఇవి కూడా అటవీ భూములే అని బుకాయిస్తోందన్నారు. రైతులు వారి పట్టా భూములలో పంటలు వేసుకుంటే పంటలకు నష్టం కలిగించడమే కాకుండా హద్దులను చెరిపేస్తున్నారని, పట్టాదారులైన రైతుల పైన కేసులు పెడుతున్నట్లు తెలిపారు. న్యాయ పరంగా, చట్ట పరంగా హక్కులు కలిగిన రైతుల పక్షాన నేను మాట్లాడుతున్నాని వాళ్ల ప్రతినిధిగా రైతులకు న్యాయం చేయాలన్నదే నా ప్రయత్నమని తెలిపారు.

### కబ్జా ఆరోపణలు లేవు..

30 ఏళ్ల నా రాజకీయ జీవితంలో ఒక గుంట భూమి కూడా కబ్జాకు పాల్పడలేదని కడియం శ్రీహరి తెలిపారు. ఈ రోజు వరకు ఒక్క ఆరోపణ లేదు, ఒక్క పోలిస్ కేసు లేదని స్పష్టం చేశారు. రాజకీయంగా నన్ను ఎదుర్కోలేని వారు నాపై చౌకబారు విమర్శలు చేస్తున్నారని సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాటికొండ రాజయ్య ఇద్దరు అక్కడికి వెళ్లి ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు, రైతులు, ప్రజలతో కలిసి మీడియా ముందే వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. అందుకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. దేవునూర్ అటవీ భూములలో ఒక గుంట భూమి కబ్జాకు పాల్పడినా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కర్రె గుట్టపైకి రావొద్దు

- మా రక్షణ కోసం బాంబులు అమర్చినం
- మావోయిస్టు పార్టీ వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత

**వరంగల్ వాయిస్, ములుగు :** వేట పేరుతో ప్రజలు కర్రె గుట్టపైకి రావద్దని మావోయిస్టు పార్టీ వెంకటాపురం–వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం శాంత పేరుతో మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. బహుళ జాతి కంపెనీలతో ఒప్పందం చేసుకున్న బీజేపీ కగారు పేరుతో ప్రజలు, ప్రజా సంఘాలు, మావోయిస్టులపై దాడులు చేపడుతోందని ఆరోపించారు. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ సైతం మావోయిస్టులపై దాడులు చేపిస్తుందని విమర్శించారు. కగార్ పేరుతో చేపట్టిన ఆపరేషన్ లో భాగంగా ఇప్పటికే అనేకమంది మావోయిస్టులతో పాటు అమాయక ప్రజలు భూటకపు ఎన్ కౌంటర్ లలో అమరులయ్యారని తెలిపారు. ఈ కగార్ నుంచి రక్షణ పొందేందుకే తాము ములుగు జిల్లాలోని వాజేడు మండలం కర్రె గుట్టలపై బాంబులు అమర్చటం జరిగిందని పేర్కొన్నారు. పోలీసుల మాయ మాటలు నమ్మి ప్రజలు గుట్టపైకి రావద్దని ఆ లేఖలో పేర్కొన్నారు. ఏది ఏమైనా శాంత పేరుతో విడుదలైన లేఖ జిల్లాలో చర్చనీయంగా మారింది.



# అవమానించిన వారిపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్, ఆర్డీఓలకు బీజేపీ ఎస్సీ మోర్చా వినతి

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట:** దళితుడైన మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ను అగ్రకుల దురహంకారంతో వర్ధన్నపేట శ్రీ సీతారామ కళ్యాణ వేదిక ప్రాంగణంలో అవమానించిన సమ్మెట శ్రీనివాస్, స్థానిక తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్ లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి ఆక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ ఎస్సీ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షుడు పోలేపాక మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్, ఆర్డీఓలకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మదాసు రాజు, హనుమకొండ జిల్లా మాజి అధ్యక్షులు జన్ను మధు, వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా ఇంచార్జి రామిండ్ల బాబు రావు, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు భరత్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



# 17న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**వరంగల్ వాయిస్, సుబేదారి** : సుబేదారిలోని యూనివర్సిటీ మహిళా కళాశాలలో ఈ నెల 17 న పూర్వ విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. సన్నాహాల్లో భాగంగా కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం చేతుల మీదుగా మంగళవారం అధికారిక పూర్వ విద్యార్థుల సమావేశం పోస్టర్‌ను విడుదల చేశారు. సుమారుగా 400 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.మధుశ్రీ, అధ్యాపకులు డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, డాక్టర్ కె.కవిత, డాక్టర్ ఎ.రవీందర్, అన్నపూర్ణ విద్యార్థులు సమీన్ (పొలిటికల్ సైన్స్) సౌమిత (ఎంసీఏ) సాహితీ (ఎంసీఏ) పాల్గొన్నారు.

# ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం

- సీపీఐ(ఎంఎల్) నేతల పిలుపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆర్ఎస్ఎస్, బీజేపీ కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలనీ మంగళవారం 'అఖిలభారత నిరసన దినంగా' పాటించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జాతీయ కమిటీ పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏకశిల పార్క్ నుంచి వరంగల్ కలెక్టరేట్ వరకు 'దేశంలో మోదీ మతోన్మాద చర్యలను నిరసిస్తూ' ప్రదర్శన నిర్వహించి, వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం డీఆర్ఓ ఎం.విజయ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం సదానందం, వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, మాస్ లైన్ వరంగల్ డివిజన్ కార్యదర్శి బొట్ల రాకేష్, జిల్లా నాయకులు మైదం పాణి, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, టీయూసీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి అడ్డూరి రాజు, ఏఐయూకేఎస్ జిల్లా నాయకులు ధార లింగన్న, కత్తుల కొమరయ్య, సతీష్, అంకుష్, మాస్ లైన్ డివిజన్ నాయకులు బుచ్చన్న, జవహర్ లాల్, మల్లేష్, సింగన బోయిన కట్టయ్య, స్వరూప, సరోజన, సంతోష, ఇంద్ర, మరియా, కొడెం మమత, ధార రాధమ్మ, ఎర్రోళ్ల లక్ష్మమ్మ, రమ తదితరులు పాల్గొన్నారు. ఇదే అంశంపై హనుమకొండ కలెక్టరేట్ లో డీఆర్ఓ వైవి.జగన్ ను ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com